రామక్రియ - ఆది

నతుమమతావ - న్మానస్త్వదీయ
నితాంతహితసర - ణింనమామి

నవదతు భవాన్ జ - నార్ధన ఘనరతి
వివాదవచనం - వృధా వృధా
తవమృదు వేదసు - ధామయవచనై
ర్వివిధావశ పద - వీం వహామి

న భజతుమాం కరు - ణానిధే భవ
ద్విభవ వినయశ్చ - వృధా వృధా
త్రిభువన సుఖకర - దివ్యరూపతే
ప్రభుతయా పరా - భవం భజామి

నచలతు వేంకట - నాధమాంవినా
విచరణమపితే - వృధా వృధా
సుచరిత్రస్త్వం - సుభగస్త్వం త్వాం
కుచయోః పులకాం - కురైర్ధరామి

ఈ సంకీర్తనలో నాయిక ప్రౌఢ. శ్రీవేంకటేశ్వరుని గతిశక్తి (Dynamic Kinetic Energy) తానే అని చెప్పుకున్న స్వాధీన భర్తృక స్వాతిశయ సానునయ సరసోక్తుల సంకీర్తనమిది. నాయిక అలమేల్మంగ స్వామివారికి సెలవిస్తున్నది.

నీ అనంతమైన ఉపకార బుద్ధికి నమస్కారం; నాకు నీపైన ఏమీకోపం లేదు.

ఓ జనార్దనా (జగదుపకారివి గదా ఒక్క ఉపకారం ఒనరించు.) మన పెను కలయికల కలహపు మాటలు ఉచ్చరించకు. ఆ మాటలు వ్యర్ధం, వ్యర్థం. అయినా నీపలుకులు మృదు మధురములై నిగమామృత వర్షిణులై అనేక విధాల నన్ను వశం తప్పేటట్టు చేస్తున్నవి. ఇలాగ నన్ను అవశను చేయకు.

వినయాల నయ నటనతో నన్ను అలరిద్దామని భ్రమింప జేయ ప్రయత్నించకు. ముల్లోకాలకూ సుఖమిచ్చే దివ్యరూపంగల నీవు నాకు మాత్రం బాధయే కలుగజేస్తు

న్నావు. కరుణ నీ సొత్తుగదా పాపం. నీ ప్రభుత్వం - గొప్పతనం - చేత నేను పరాభవం పొందుతున్నాను. నువ్వు చాలా గొప్పవాడివే కానీ నామనసెరిగి మసలటం లేదు నీవు.

తిరువేంకటాచలపతీ! కదలకు. (స్థిరంగా నాచెంతనే ఉండు) నేనులేకుండా నీవెంత తిరిగినా వ్యర్థమే (నేను నీశక్తి స్వరూపను) సచ్చారిత్రుడవు జగన్మోహనుడవు, నిన్ను అవలీలగా నా కుచముల పులకలపై మోయగల దానను. (ఆనందంతో పులకరించే నా యెదపైన భరిస్తాను.) అలమేల్మంగకు తనపతిపై గల సర్వతంత్ర స్వాతంత్ర్య సామర్థ్యాలను సంస్థాపించటంలో శ్రీశంకరుల సౌందర్యలహరిలోని ప్రథమ శ్లోకానికి సమస్కంధంగా సాగింది ఈ సంకీర్తన

'శివశ్శక్త్యా యుక్తో యదిభవతి శక్తః ప్రభవితుం
నచేదేవం దేవః నఖలుకు శలస్పంది తుమపి'

పరమశివుడు శ్రీదేవిని కలసితే జగత్తంతా సృష్టించగలడు. ఆమె చెంత లేకపోతే జడత్వం వాటిల్లి అటూఇటూ కదలలేని అశక్తుడు ఆయన అని శంకరులు అమ్మవారి శక్తి స్వభావాన్ని సన్నుతించారు. శంకరులు మధ్యమ పురుషలో చెప్పిన విషయాన్ని అమ్మవారి మాటగా ఉత్తమ పురుషలో ఉద్ఘాటించారు అన్నమాచార్యులు.